సాక్షి విశాఖపట్నం

మంగళవారం | 19 | నవంబర్ | 2024



శివాలయాలకు కార్తీక శోభ 8లో



చిరు వ్యాపారులపై కూటమి పగ 8లో



పలు రైళ్లు దారి మళ్లింపు 8లో

న్యూస్‌రీల్

సింహాద్రి ప్రాజెక్ట్ హెడ్ సమీర్‌శర్మ బాధ్యతల స్వీకరణ



పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్ట్ నూతన హెడ్(హెచ్‌వోపీ)గా సమీర్ శర్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్టీపీసీలో 1988 ఆగస్టు 24న చేరిన సమీర్‌శర్మ సంస్థలో అనేక కీలకమైన పదవులను నిర్వహించారు. ఇంతకు ముందు ఆయన ఆపరేషన్ అండ్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో జనరల్ మేనేజర్‌గా వ్యవహరించారు. కొత్త బాధ్యతల్లో సంస్థ మరిన్ని కొత్త మైలురాళ్లను అధిగమించి, భారతదేశ ఇంధన రంగానికి కీలకంగా మారాలని అభినందిస్తూ పలు విభాగాల అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి, స్వాగతించారు.

జీవీఎంసీకి రూ.10 కోట్ల ఆస్తిపన్ను చెల్లించిన పోర్టు



కమిషనర్ సంపత్‌కుమార్‌కు చెక్కు అందిస్తున్న పోర్టు ఫైనాన్స్ మేనేజర్ రమణమూర్తి

డాబాగార్డెన్స్ : విశాఖ పోర్టు అథారిటీ 2024–25 ఏడాదికి గాను రూ.10 కోట్ల ఆస్తి పన్నును చెక్కు రూపంలో చెల్లించినట్లు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ తెలిపారు. పోర్టు ఫైనాన్స్ మేనేజర్ రమణమూర్తి నుంచి జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ ఎస్.శ్రీనివాస్, జోనల్ కమిషనర్ రాము ఈ చెక్కు అందుకున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల నుంచి ఆస్తి పన్ను, బకాయిల వసూళ్లపై రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని వారిని ఆదేశించారు.

జీసీసీ చైర్మన్‌గా కిడారి శ్రావణ్ బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రావణ్‌కుమార్

విశాఖ సిటీ: ఆంధ్రప్రదేశ్ గిరిజన సహకార సంస్థ(జీసీసీ) చైర్మన్‌గా కిడారి శ్రావణ్‌కుమార్ సోమవారం జీసీసీ ప్రధాన కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేష్, గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మౌలిక సదుపాయాల విస్తరణ, సిబ్బంది సంక్షేమం, అభివృద్ధి, వ్యాపార విస్తరణ, ప్రధాన యాత్రా కేంద్రాలు, పర్యాటక ప్రదేశాల్లో జీసీసీ రిటైల్ అవుట్‌లెట్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. అనంతరం గిరిజన ఉత్పత్తుల రవాణాను సులభతరం చేసేందుకు రెండు కొత్త లారీలను ప్రారంభించారు.

కమిషనరేట్‌కు ఇద్దరు సీఐలు

బీచ్‌రోడ్డు: విశాఖపట్నం రేంజ్ పరిధిలో వీఆర్‌లో ఉన్న ఇద్దరు సీఐలను నగర పోలీసు కమిషనరేట్‌కు కేటాయిస్తూ డీఐజీ ఉత్తర్వులు సోమవారం జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న సీఐ జి.ఉమా మహేశ్వర రావు, సీఐ ఎం.నాగేశ్వర రావును కమిషనరేట్‌కు కేటాయించారు.

నేటి నుంచి బాలోత్సవం



వివరాలు వెల్లడిస్తున్న జీఎస్ రాజేశ్వరరావు

డాబాగార్డెన్స్: మహారాణిపేటలో గల సెయింట్ ఆంథోనీ ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 19 నుంచి 21 వరకు బాలోత్సవం నిర్వహించనున్నట్లు బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జి.ఎస్.రాజేశ్వర రావు తెలిపారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతేడాది 6 వేల మంది పిల్లలు 84 ఈవెంట్లలో పాల్గొనగా, ఈ ఏడాది అంతకన్నా ఎక్కువ మంది పిల్లలు పాల్గొంటారని తెలిపారు. కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్, డీఈవో సారథ్యంలో ఆహ్వాన సంఘం ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యక్షురాలు రమాప్రభ మాట్లాడుతూ 700 స్కూళ్లకు పోటీల బ్రోచర్ పంపామన్నారు. కోశాధికారి దండు నాగేశ్వరరావు మాట్లాడుతూ పోటీలు జరిగే 76 ఈవెంట్లకు జడ్జీలుగా వ్యవహరించేందుకు కళా, సాంస్కృతిక రంగాల్లో నిష్ణాతులైన 96 మంది అంగీకరించారని తెలిపారు. అధ్యక్షుడు పి.రఘు, కమిటీ సభ్యులు ఎల్లాజీ, సీహెచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

విశాఖ జిల్లాలో బీసీ వసతి గృహాలు 29	ప్రీ మెట్రిక్ వసతి గృహాలు 11	బాలురు – 7	బాలికలు – 4	పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు 18	బాలురు – 9	బాలికలు – 9	ఎస్సీ వసతి గృహాలు 23 బాలురు – 12 బాలికలు – 11

భద్రత కరువు సంక్షేమం బరువు

హాస్టల్స్‌లో మౌలిక సదుపాయాలు కనుమరుగు

సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థుల సంక్షేమం సంక్షోభంలో చిక్కుకుంటోంది. పాలకుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ వసతిగృహాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. పేద విద్యార్థులపై కనికరం చూపడం లేదన్న విమర్శలు తల్లిదండ్రులతో పాటు విద్యార్థి సంఘాల నుంచి వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం మొక్కుబడిగా వసతి గృహాలను నిర్వహిస్తోందన్న విమర్శలున్నాయి. విశాఖ జిల్లా పరిధిలో బీసీ వసతి గృహాలు 29, ఎస్సీ వసతి గృహాలు 23 ఉన్నాయి. ఇప్పుడు ఇవి సమస్యల గృహాలుగా మారిపోయాయి. మౌలిక సదుపాయాలు మరుగున పడిపోయాయి. ప్రహరీలు లేకపోవడంతో భద్రతకు భరోసా కరువైంది. ఎప్పుడు ఏ పెచ్చు ఊడి మీద పడిపోతుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రతి నెలా ఇవ్వాల్సిన కాస్మోటిక్ చార్జీలకు సర్కారు మంగళం పాడేసింది. సమస్యలతో సావాసం చేస్తున్న విద్యార్థుల భవిష్యత్తు గురించి ఏమాత్రం కనికరం లేకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

– సాక్షి, విశాఖపట్నం/భీమిలి/మధురవాడ/సీతమ్మధార/పెదగంట్యాడ



మధురవాడ కళాశాల బాలుర హాస్టల్‌కి ప్రహరీ, కిటికీలకు తలుపులేని దుస్థితి

- కాస్మోటిక్ చార్జీలకూ దిక్కుమొక్కూ లేదు
- ప్రహరీలు లేకపోవడంతో భద్రత కరువు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

బిక్కుబిక్కుమంటూ..




భీమిలిలో ఉన్న ఈ భవనంలో ప్రభుత్వ ఎస్సీ బాలుర సాంఘిక సంక్షేమశాఖ కళాశాల వసతి గృహం నడుస్తోంది. సుమారు 40 ఏళ్ల క్రితం ఈ వసతి గృహాన్ని నిర్మించారు. ప్రస్తుతం ఇందులో ఇంటర్ నుంచి డిగ్రీ చదువుతున్న 80 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ భవనం పూర్తిగా శిథిలమైపోయింది. రెండో విడత నాడు–నేడులో దీన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈలోగా ప్రభుత్వం మారిపోవడం.. కొత్త ప్రభుత్వం దాన్ని బుట్టదాఖలు చేయడంతో విద్యార్థుల కష్టాలు మళ్లీ మొదటికొచ్చాయి. పైకప్పుల పెచ్చులు ఊడిపడిపోతుండడంతో విద్యార్థులు రాత్రి పూట బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. మరుగుదొడ్లు పూర్తిగా దెబ్బతినడంతో కొందరు విద్యార్థులు బహిర్భూమికి బయటకు వెళ్లే పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రహరీ ఊసే లేదు



ఇది పెదగంట్యాడ సమీపంలోని సిద్దేశ్వరంలో గల ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహం. ఇక్కడ మొత్తం 97 మంది విద్యార్థినులు ఉన్నారు. ఈ భవనం నివాసాల మధ్య ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఆధునికీకరణ పనులు చేపట్టారు. రెండో విడతలో ప్రహరీకి ఫెన్సింగ్ పనులకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రభుత్వం మారిన తర్వాత దాని ఊసే పట్టించుకోవడం లేదు. దీంతో విద్యార్థినులు భయాందోళనలకు గురవుతున్నారు.

అధ్వానంగా వసతి గృహాలు



సమీకృత బాలుర హాస్టల్‌లో మరుగుదొడ్ల దుస్థితి

మధురవాడలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ కళాశాల బాలుర వసతి గృహం, సమీకృత బాలుర హాస్టల్స్ నిర్వహణ మరీ దారుణంగా ఉంది. రెండు హాస్టళ్లకు కిటికీలకు తలుపులు లేవు. ట్యాప్‌లు, డోర్‌లు, బేసిన్‌లు కూడా శిథిలమయ్యాయి. కళాశాల హాస్టల్‌కి ప్రహరీ లేదు. పందులు, కుక్కలు చొరబడుతున్నాయి. మురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తోంది.

అప్పు చేసి పప్పు కూడు



సీతమ్మధారలోని ప్రభుత్వ ప్రీ–మెట్రిక్, పోస్టు మెట్రిక్ కళాశాల ఎస్సీ బాలుర వసతి గృహాల్లో విద్యార్థుల ఆకలి కేకలు ఎవరికీ వినిపించడం లేదు. ప్రభుత్వం సకాలంలో డైట్ చార్జీలు విడుదల చేయకపోవడంతో హాస్టల్ అధికారి అప్పు చేసి హాస్టల్ నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. నెలల తరబడి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థుల పోషణ కష్టతరంగా ఉంటుందని హాస్టల్ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మరోవైపు ప్రభుత్వం కొన్ని నెలలుగా నిధులు ఇవ్వకపోవడం విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాస్మోటిక్ చార్జీలూ కష్టమే..

ప్రభుత్వం వసతి గృహాల విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను నెలవారీగా చెల్లించాలి. అయితే కొన్నినెలలుగా ఆ చార్జీలు ఇవ్వడం లేదు. దీంతో విద్యార్థులు తలకు నూనె కొనాలన్నా, స్నానానికి సబ్బు కావాలన్నా ఇంటి వైపు చూడక తప్పడంలేదు. కాస్మోటిక్ చార్జీల కింద 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు రూ.170, ఆరు నుంచి పదో తరగతి వరకు రూ.200, ఇంటర్, ఆపై విద్యార్థులకు రూ.250 అందజేయాలి. అయితే ఇవేవీ ప్రభుత్వం చెల్లించకపోతుండటంతో విద్యార్థులు తల్లిదండ్రులపై ఆధారపడుతున్నారు. ఇది వారికి భారంగా మారుతోంది. డైట్ చార్జీల కింద 3, 4 తరగతుల విద్యార్థులకు ఒక్కొక్కరికి నెలకు రూ.1,150, 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.1400, ఇంటర్, డిగ్రీ, పీజీ, వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులకు నెలకు రూ.1,600 చొప్పున చెల్లించాలి. కొన్ని నెలలుగా ఈ నిధులు కూడా విడుదల కావడం లేదు.

హాస్టళ్లలో.. హాహాకారాలు

భోజనం సక్రమంగా అందదు.. తలకు నూనె లేదు.. కప్పుకోవడానికి దుప్పటి లేదు.. లైటు కాలిపోతే మార్చే దిక్కులేదు.. మరుగుదొడ్ల నిర్వహణ లేదు.. ఇదీ జిల్లాలోని హాస్టళ్లలో తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువుకుంటున్న విద్యార్థుల పరిస్థితి. ప్రభుత్వం నుంచి భోజనం బిల్లులు విడుదల కాక.. వారికి సక్రమంగా ఆహారం అందక అర్ధాకలితో అలమటిస్తున్నారు. పిల్లల ఆకలి కేకలు చూడలేక కొందరు సంక్షేమాధికారులైన హాస్టళ్ల నిర్వాహకులు అప్పులు చేసి ఆహార పదార్థాలను అందజేస్తున్నారు. వారు కూడా అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో సంక్షేమం సంక్షోభంలో చిక్కుకుపోయింది.

కాస్మోటిక్ చార్జీలు చెల్లించడం లేదు



నా పేరు ఎ.భూలక్ష్మి. నర్సీపట్నం నుంచి వచ్చి సిద్దేశ్వరంలో గల ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహంలో మూడేళ్లుగా ఉంటున్నాను. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. కొన్ని నెలలుగా కాస్మోటిక్ చార్జీలు చెల్లించడం లేదు. 20 రోజుల క్రితం రూ.280 చెల్లించారు.

ఇబ్బందులు పడుతున్నాం



నా పేరు రావాడ ప్రియాంక. చోడవరం నుంచి వచ్చి దయాళ్‌నగర్ సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల వసతి గృహంలో ఉంటున్నాను. నర్సింగ్ సెకండ్ ఇయర్ చదువుతున్నాను. కొన్నాళ్లుగా కాస్మోటిక్ చార్జీలు చెల్లించడం లేదు. దీంతో అమ్మనాన్నను అడిగి తీసుకుంటున్నాం.

గాలికొదిలేశారు



ప్రహరీ పడిపోవడంతో అడ్డంగా పెట్టిన రేకులు

కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలిక స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) హాస్టల్ నిర్వహణలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. బాలిక హాస్టల్ ప్రహరీ పడిపోవడంతో పశువులు, కుక్కలు ప్రవేశించి పరిసరాలు అస్తవ్యస్తంగా చేస్తున్నాయి. బోరుబావి బాలికల నీటి అవసరాలు తీర్చలేకపోతోంది. హ్యాండ్ పంప్ నిర్వహణ గాలికి వదిలేశారు. రెండు డార్మిటరీల్లో ఒక డార్మిటరీ మరుగుదొడ్లకు నీటి సరఫరాలేదు. ఒక డార్మిటరీలో ఉన్న 15 మరుగు దొడ్లనే సుమారు 500 మంది ఉపయోగిస్తున్నారు. హాస్టల్ ఆవరణలో వర్షం నీరు నిల్వ ఉండిపోతోంది. డైనింగ్ హాల్‌లో ద్వారం, తలుపులు శిథిలమయ్యాయి.

అర్జీలు పునరావృతం కాకూడదు

- వినతులకు తక్షణ పరిష్కారం చూపాలి
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో వచ్చిన అర్జీలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని, నిర్దీత కాల వ్యవధిలో పరిష్కారం చూపాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా నలుమూలలనుంచి వచ్చిన ప్రజలనుంచి అధికారులు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమస్య పూర్వాపరాలు తెలుసుకొని సరైన పరిష్కారం చూపాలన్నారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో 328 వినతులు అందగా..రెవెన్యూ శాఖకు 149 ఉండగా, పోలీసు శాఖకు 19, జీవీఎంసీకి 53 ఉన్నాయి. అలాగే ఇతర విభాగాలకు సంబంధించి 107 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, జెడ్పీ సీఈవో నారాయణమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మధుసూదన రావు పాల్గొన్నారు.

జీవీఎంసీ పీజీఆర్ఎస్‌కు 106 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, కమిషనర్ సంపత్‌కుమార్

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 106 వినతులు వచ్చాయని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. జీవీఎంసీ పాత సమావేశ మందిరంలో కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి మేయర్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జోన్–2 నుంచి 13, జోన్–3 నుంచి 19, జోన్–4 నుంచి 8, జోన్–5 నుంచి 5, జోన్–6 నుంచి 10, జోన్–8 నుంచి 15 ఫిర్యాదులు రాగా, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సంబంధించి 36 ఫిర్యాదులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఆర్.సోమన్నారాయణ, ప్రధాన ఇంజనీర్ శివప్రసాదరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, సీపీ మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు

విశాఖ సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 91 ఫిర్యాదులు వచ్చాయి. సీపీతో పాటు ఇతర ఉన్నతాధికారులు ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

అప్పు ఇచ్చిన నగదు ఇప్పించిన సీపీ

అప్పుగా ఇచ్చిన నగదు తిరిగి ఇవ్వకపోవడంతో ఒక బాధితుడు పీజీఆర్ఎస్ ద్వారా పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చిని ఆశ్రయించగా.. అప్పు తీసుకున్న వారిని పిలిపించి ఆ నగదును బాధితుడికి ఇప్పించే ఏర్పాట్లు చేశారు. రావనుకున్న డబ్బు తిరిగి ఇప్పించిన సీపీకి బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

బతికున్నా చంపేశారు

- నకిలీ డాక్యుమెంట్లతో 7.2 ఎకరాల కబ్జాకు యత్నం
- కలెక్టర్, జేసీకి బాధిత మహిళ ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న గంటా సత్యవతి

మహారాణిపేట: బతికున్న వృద్ధురాలిని చనిపోయినట్టు సృష్టించారు..నకిలీ డ్యాక్యుమెంట్లతో ఆమెకు చెందిన భూమిని కాజేయాలని యత్నించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో బాధిత వృద్ధురాలు గంటా సత్యవతి ఫిర్యాదు చేయడంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. గంటా సత్యవతి 1970లో పెందుర్తి మండలం, చీమలాపల్లి గ్రామంలో పట్టా నంబర్ 75లో సర్వే నంబర్ 24/3డీ2లో 15.96 ఎకరాల భూమిని ఆరి అప్పలస్వామి నుంచి కొనుగోలు చేశారు. అయితే ఈ భూమిని 2012లో 22ఏలో చేర్చారు. దీనిపై గంటా సత్యవతి కోర్టులో కేసు వేసింది. ఈ సమయంలో కడప జిల్లాకు చెందిన వల్లూరు సోమశేఖర్ ఆ భూమిపై కన్నేశారు. సత్యవతి నుంచి 1998, సెప్టెంబర్17వ తేదీన 7.2 ఎకరాలు కొనుగోలు చేసినట్లు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నించారు. 2022లో గుంటూరు జిల్లాకు చెందిన ఖాన్ అనే వ్యక్తికి సత్యవతి జీపీఏ చేశారు. జీపీఏ ఆధారంగా ఆయన అదే ఏడాది డిసెంబర్ 28న సీసీఎల్ఏకి వెళ్లి.. సెట్ 2 (1)/180/2023 తీసుకొచ్చారు. దీని ద్వారా రైతు వారి పట్టా పొందడానికి ఖాన్ ప్రయత్నించారు. ఇదిలా వుండగా సత్యవతి మృతి చెందినట్టు వల్లూరు సోమశేఖర్ డాక్యుమెంట్లు సృష్టించిన విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో గంటా సత్యవతి సోమవారం కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణం విచారించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జేసీ హామీ ఇచ్చారు.

వాల్తేరు డీఆర్ఎంపై ఎఫ్ఐఆర్ నమోదు

సాక్షి, విశాఖపట్నం: కాంట్రాక్టర్ల నుంచి రూ.25 లక్షల లంచం తీసుకుంటూ పట్టుబడిన వాల్తేరు డీఆర్ఎం సౌరభ్‌కుమార్ ప్రసాద్‌పై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిలో పనులు నిర్వహించే కాంట్రాక్టు సంస్థ యజమానుల నుంచి రెండు రోజుల క్రితం పూణేలో లంచం తీసుకుంటూ సీబీఐకి డీఆర్ఎం చిక్కిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి సమగ్ర వివరాలతో దర్యాప్తు బృందం నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో డీఆర్ఎం పేరుని ఏ1గా చేర్చింది. ముంబైకి చెందిన డీఎస్ మార్కెటింగ్ సంస్థ ప్రొప్రైటర్ సనిల్ రాథోడ్‌ని ఏ2గా, పూణేకి చెందిన హెచ్ఆర్‌కే సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ ఆనంద్‌భగత్‌ని ఏ3గా, హెచ్ఆర్‌కే సొల్యూషన్స్, గుజరాత్‌కు చెందిన హిందూస్తాన్ ఫైబర్ గ్లాస్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల్ని ఏ4, ఏ5లుగా చేర్చింది. సౌరభ్‌కుమార్‌తో పాటు మిగిలిన వ్యక్తులు, సంస్థలపై సెక్షన్ 61(2) ఆఫ్ బీఎన్ఎస్ 2023, పీసీ యాక్ట్ 1988లోని సెక్షన్ 7, 8, 9, 10, 12 నమోదు చేసినట్లు సీబీఐ ఢిల్లీ ఏసీ–1 కార్యాలయ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సుమన్‌కుమార్ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. తదుపరి విచారణ బాధ్యతల్ని సీబీఐ ఏసీ–1 సీఐ భన్వేంద్ర చౌదరి కొనసాగిస్తారని ఎస్పీ స్పష్టం చేశారు.

భూకబ్జాలకు పాల్పడిన వారిపై విచారణ చేయాలి

- రూ.350 కోట్ల భూమిని అక్రమార్కులకు కట్టబెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి
- సీఎం చంద్రబాబుకు బహిరంగ లేఖ రాసిన శాసనమండలి విపక్షనేత బొత్స



సాక్షి, విశాఖపట్నం: విజయనగరం జిల్లాలో దాదాపు రూ.350 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని అక్రమార్కులకు కట్టబెట్టిన ఒక ఉన్నతాధికారి, అందులో భాగస్వాములైన ప్రజాప్రతినిధులపై విచారణకు ఆదేశించి చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. విజయనగరం జిల్లాలో గతంలో జరిగిన భూకబ్జాలకు సంబంధించి కొంతమంది అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై సమగ్ర విచారణ చేసి భూకబ్జాలకు పాల్పడిన అధికారులు, ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు. వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడానికి వీలైనంత త్వరగా నివేదికలోని విషయాలపై లోతైన విచారణకు ఆదేశించాలని అభ్యర్థిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ జైలు

విశాఖ లీగల్: అప్పు తీర్చాలని అడిగిన వ్యక్తిని అతికిరాతకంగా హత్య చేసిన యువకుడికి యావజ్జీవ జైలు శిక్షతోపాటు రూ.10 వేలు జరిమానా చెల్లించాలని నగరంలోని రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి గాయత్రీ దేవి సోమవారం తీర్పునిచ్చారు. ప్రభుత్వం మృతుని కుటుంబానికి రూ.6 లక్షలు పరిహారం చెల్లించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగులు జగదీశ్వరరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మురళీనగర్ ప్రాంతంలోని అయ్యప్ప నగర్‌కు చెందిన వై.పవన్ కుమార్ టాక్సీ సర్వీస్‌తో పాటు ఇంటర్‌నెట్ సెంటర్ నడుపుతున్నాడు. అదే ప్రాంతంలో శంకర్ శ్రీనివాస్ ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. వీరిద్దరి మధ్య స్నేహం ఏర్పడింది. ఇదే అదనుగా శ్రీనివాస్ నుంచి రూ.75 వేలు పవన్ కుమార్ అప్పుగా తీసుకున్నాడు. ఎన్నిసార్లు అడిగినా ఇదిగోఅదిగో అని దాట వేస్తున్నాడు. డబ్బులు ఇవ్వలేక..శంకర్ శ్రీనివాస్‌ను హత్య చేయాలని ప్లాన్ చేశాడు. పెట్రోల్ పోసి కాల్చి చంపాలని నిర్ణయించుకున్నాడు. డబ్బులు ఇస్తానని.. షాపు వద్దకు రమ్మని శ్రీనివాస్‌కు చెప్పాడు. మొదటి రోజు రాకపోవడంతో రెండో రోజు రాత్రి పది గంటల సమయంలో శ్రీనివాస్ షాప్ వద్దకు రాగానే.. మాటామాటా కలిపి కొద్ది దూరం తీసుకువెళ్లి పెట్రోల్ పోసి కాల్చివేశాడు. స్థానికులు గమనించి తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతున్న శ్రీనివాస్‌ను ఆస్పత్రిలో చేర్పించగా..చికిత్స పొందుతూ మృతి చెందాడు. కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.



స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

- విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయబోమని ప్రధాని మోదీ ప్రకటన చేయాలి
- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్


ఐక్యత చాటుతున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ


కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ నాయకులు

డాబాగార్డెన్స్/ మహారాణిపేట: విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వంద్వ వైఖరిని విడనాడాలని, ప్రభుత్వ రంగంలోనే స్టీల్ ప్లాంట్‌ను కొనసాగించేలా సెయిల్‌లో విలీనం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు జె.అయోధ్యరామ్, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 29వ తేదీన విశాఖ వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయబోమని, సెయిల్‌లో విలీనం చేస్తున్నట్టు ప్రకటించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పూర్తిస్థాయి సామర్థ్యంతో ఉత్పత్తి చేసేలా నడపాలని, మిగిలిపోయిన నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని కోరారు. స్టీల్ ప్లాంట్‌కు 26వేల ఎకరాల భూములు ఉన్నాయని, ఇవన్నీ రాష్ట్రపతి పేరిట ఉన్నాయని, వీటిని స్టీల్‌ప్లాంట్ పేరుతో బదలాయించాలన్నారు. ఈ నెల 24, 26 తేదీల్లో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు, డి.సురేష్ బాబు, జి.గణపతిరెడ్డి, పైడిరాజు పాల్గొన్నా రు.

ప్రధానికి లేఖ : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ వివిధ ప్రజా సంఘాల నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. అదేవిధంగాఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వీవీ రమణమూర్తి నేతృత్వంలో సోమవారం విశాఖపట్నంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు అనంతరం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందించి ప్రధాని మోదీకి పంపాలని కోరారు.

‘కూటమి వచ్చాక ఒక్క సమస్యా పరిష్కారం కాలేదు’


గాంధీపార్కులో ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

సీతమ్మధార: టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆశ వర్కర్స్‌కు కనీస వేతనాలు అమలు చేస్తామని చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చి, ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు దాటినా అమలు చేయకపోవడం అన్యాయమని సీఐటీయూ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. జీవీఎంసీ గాంధీ పార్కులో సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆశ వర్కర్ల సమస్యలేవీ పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు పెరగలేదు, పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచుతామని ఇచ్చిన హామీ నెరవేరలేదు. మట్టి ఖర్చులు రూ.20 వేలు ఇస్తామన్నారు..వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, గ్రూపు ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని హామీ ఇచ్చారు. వాటిపై ఇంతవరకు ఎటువంటి కదలిక లేకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్నామన్నారు. బడ్జెట్ సమావేశాల్లో కూడా కనీసం ఆశాల గురించి ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.జగన్, యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు పి.మణి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.పద్మ, వి.మేరీ, కోశాధికారి వై. సీతారత్నం, జిల్లా నాయకులు సన్యాసి పైడమ్మ, రవణమ్మ, సరోజిని, లక్ష్మి, విజయలక్ష్మి, దయానా, సుజాత, సరస్వతి, శ్యామల, రేణుక, లీలారాణి, అనురాధ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఫ్లోటింగ్ బ్రిడ్జి పరికరాల తరలింపు


ఫ్లోటింగ్ బ్రిడ్జి పరికరాలను తరలిస్తున్న సిబ్బంది

ఏయూక్యాంపస్: బీచ్‌రోడ్డులో విక్టరీ ఎట్ సీ ఎదురుగా గతంలో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జి పరికరాలను రుషికొండ ప్రాంతానికి తరలిస్తున్నారు. గతంలో ఇక్కడ ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జికి కెరటాల ఉధృతి కారణంగా ప్రమాదం జరిగే అవకాశం ఉండడంతో నిలిపివేశారు. తాజాగా అధికారులు దీనిని రుషికొండ ప్రాంతంలో ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల వీఎంఆర్‌డీఏ అధికారులు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ నిపుణుల బృందంతో కలిసి ఫ్లోటింగ్ బ్రిడ్జి ఏర్పాటుకు అనుకూలమైన ప్రాంతాన్ని గర్తించినట్లు తెలుస్తోంది. దీంతో లంగర్లు, తాళ్లు, స్విమ్ ట్యూబ్, లైఫ్ జాకెట్స్ వంటివి వ్యాన్‌లో తరలించారు. త్వరలో ఇతర ఫ్లోటింగ్ బ్రిడ్జికి ఉపయోగించిన క్యూబ్స్‌ను తరలించే అవకాశం ఉంది. గతంలో బీచ్‌లో ఫ్లోటింగ్ బ్రిడ్జిని ఏర్పాటు చేస్తే విమర్శించిన వారు...నేడు దీనిని మరొక ప్రాంతంలో ఏర్పాటుకు చేస్తుండడం గమనార్హం .

రుషికొండ బీచ్ పరిశీలన

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం అయిన రుషికొండ బీచ్‌లో తేలియాడే వంతెన (ఫ్లోటింగ్ బ్రిడ్జ్) ఏర్పాటుకు యంత్రాంగం సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. రుషికొండ బీచ్ అనువైనదిగా గుర్తించి నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో ఫ్లోటింగ్ బ్రిడ్జ్ నిర్వాహకులు, నిపుణుల బృందం సోమవారం సాయంత్రం రుషికొండ బీచ్‌ను పరిశీలించారు. ఇదిలా ఉండగా ఈ బీచ్‌లో ఇప్పటికే స్కూబా, కయాకింగ్, సర్ఫింగ్, స్పీడ్ బోట్ల నిర్వహణ జరుగుతుంది. వీటి వలన ఇక్కడ ఫ్లోటింగ్ బ్రిడ్జ్ ఏర్పాటు చేస్తే కలిగే ఇబ్బందులను పరిశీలిస్తున్నారు.

సింహగిరి జలధారలపై అధ్యయనం

సింహాచలం: సింహగిరిపై ఉన్న జలధారలపై దాన్ ఫౌండేషన్ సంస్థ సోమవారం అధ్యయనం చేసింది. ఆ ఫౌండేషన్ ప్రతినిధి ఎస్. లోకేష్ సింహగిరిపై ఉన్న గంగధార, నాగధార, సాగిధార, ఆకాశధారలను పరిశీలించారు. నీటి నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో తమ సంస్థ నగరంలో ఉన్న స్ప్రింగ్స్‌పై అధ్యయనం చేస్తోందన్నారు. నీటి నాణ్యత, వాటర్ ఫ్లో తదితర అంశాలపై పరిశీలిస్తున్నామన్నారు. అందులో భాగంగా సింహాచలం కొండపై ఉన్న జలధారలను కూడా అధ్యయనం చేయనున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న నీటి ఫ్లో భవిష్యత్తులో కూడా అలాగే ఉంటుందా...లేకపోతే ఏంచేయాలన్న విషయంపై నిపుణులతో చర్చిస్తామన్నారు. దీనిపై ఓ రిపోర్టు తయారు చేయనున్నామని వెల్లడించారు. ఈనెల 23న కలెక్టర్, వీఎంఆర్‌డీఏ కార్యదర్శి సమక్షంలో సింహాచలం దేవస్థానం అధికారులు, తమ ఆర్గనైజేషన్ అందజేసే నివేదికపై చర్చిస్తారన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రాంబాబు పాల్గొన్నారు.

108 ఉద్యోగుల ఉద్యమ బాట


శిబిరంలో మాట్లాడుతున్న సీఐటీయూ నేత జగన్

సీతమ్మధార: రాష్ట్ర వ్యాప్తంగా 108 ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జగన్ డిమాండ్ చేశారు. సోమవారం జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని కొద్ది రోజులుగా శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్నా యాజమాన్యం, ఇటు ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దీంతో 20 జిల్లాల్లో ఉద్యోగ ప్రతినిధులు ఇటీవల విజయవాడలో సమావేశమై 108 అబులెన్స్‌ల యాజమాన్యాలకు సమ్మె నోటీసు అందజేశారన్నారు. అప్పటి నుంచి అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 25వ తేదీ తరువాత సమ్మె చేయనున్నట్టు స్పష్టం చేశారు. సమ్మె కారణంగా ప్రజలకు కలిగే అసౌకర్యాలకు పూర్తి బాధ్యత యాజమాన్యం, ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. 108 అంబులెన్స్ వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలని, అందులో పనిచేసే వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ గౌరవ సలహాదారు బి.శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు కుమార్, అధ్యక్షుడు బంగార్రాజు, కోశాధికారి డి.సురేష్, డివిజనల్ సెక్రటరీ టి.వాసుదేవరావు, సీహెచ్.సింహాద్రినాయుడు, 108 ఉద్యోగులు పాల్గొన్నారు.

నీటి సరఫరా, పారిశుధ్యంపై యాక్షన్ ప్లాన్


మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: తాగునీరు, పారిశుధ్యంపై ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ మందిరంలో సోమవారం జిల్లా నీరు, పారిశుధ్య మిషన్ కమిటీ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. నగరంలో కుళాయిల ద్వారా సురక్షిత మంచినీటిని సరఫరా, పారిశుధ్య ప్రణాళికలు అమలు చేయడం, కమ్యూనిటీ, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో మరుగుదొడ్ల నిర్వహణ అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. అనంతరం కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ కమ్యూనిటీ మరుగుదొడ్లలో శుభ్రత పాటించే మూడు పంచాయతీలకు నగదు బహుమతులు ప్రకటించాలన్నారు. మంగళవారం నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు గ్రామ స్థాయి సమావేశాలు నిర్వహించి తాగునీరు, పారిశుధ్య సమస్యలు గుర్తించాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, జిల్లా విద్యా శాఖ అధికారి ప్రేమ్ కుమార్, డ్వామా పీడీ పూర్ణిమ దేవి, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులపై కూటమి పగ

- బీచ్‌రోడ్డులో షాపులు తొలగించిన అధికారులు
- రోడ్డున పడిన కుటుంబాలు


కమిషనర్‌కు వినతి పత్రం అందజేసి తిరిగి వస్తున్న చిరువ్యాపారులు

బీచ్‌రోడ్డు: చిరు వ్యాపారులను కూటమి నేతలు రోడ్డున పడేస్తున్నారు. నగరంలో చిరు బతుకులపై కక్ష కట్టారు. మొన్న 22వ వార్డులో షాపులు తొలగిస్తే..నేడు సాగరతీరంపై పడ్డారు. ఆర్కే బీచ్ ఆనుకుని ఎప్పట్నించో ఉన్న షాపులను అధికారులపై ఒత్తిడి తెచ్చి తొలగిస్తున్నారు. బీచ్‌కు వచ్చే సందర్శకులు.. అక్కడేర్పాటు చేసిన షాపుల్లో ఆహార పదార్థాలు విక్రయిస్తూ అలలను వీక్షిస్తూ ఎంజాయ్ చేస్తుంటారు. అలా చిరు వ్యాపారులు ఏళ్ల తరబడి సాగరతీరాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. కూటమి నేతలకు ఏ సమస్య వచ్చిందో తెలియదు గానీ..ఆ చిరు వ్యాపారులపై జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. వారు ఫిర్యాదు ఇవ్వడం జీవీఎంసీ అధికారులు షాపులు తొలగించడం చకచకా జరిగిపోతోంది. దీంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

22వ వార్డులో షాపులు తొలగింపు

స్థానిక కార్పొరేటర్ ప్రజలపై కక్ష సాధింపులకు దిగుతున్నాడు. 22వ వార్డు కార్పొరేటర్, జనసేన నాయకుడు పీతల మూర్తి యాదవ్ హైకోర్టు ద్వారా వార్డులోని చిరువ్యాపారుల షాపులను ఇటీవల తొలగించాడు. ఏళ్ల తరబడి నడుపుకుంటున్న షాపులను ఎటువంటి సమాచారం లేకుండా జీవీఎంసీ సిబ్బంది నేలమట్టం చేశారు. దీంతో వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

తాజాగా బీచ్ రోడ్డులో..

చిన్నవాల్తేరు నుంచి బీచ్‌రోడ్డుకు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టులపై జీవీఎంసీ కమిషనర్‌కు కూటమి నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో ఎటువంటి సమాచారం ఇవ్వకుండా సుమారు 50కు పైగా షాపులు జీవీఎంసీ సిబ్బంది తొలగించారు.

జీవీఎంసీ కమిషనర్‌కు వినతి

తమకు జరిగిన అన్యాయంపై బీచ్ రోడ్డులోని చిరువ్యాపారులు జీవీఎంసీ కమిషనర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. షాపులు తొలగించడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉందని..షాపుల వలన ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు, పారిశుధ్య సమస్యలూ లేవని కమిషనర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన కమిషనర్ నేరుగా వచ్చి పరిశీలించిన అనంతరం అనుమతుల కోసం చర్యలు తీసుకుంటామన్నారు.

తూర్పులో వర్గపోరు..

తూర్పు నియోజకవర్గంలోని కూటమి నాయకులు వర్గాలుగా విడిపోయారు. ఎమ్మెల్యే వెలగపూడిని.. కూటమి నాయకులు లెక్క చేయడం లేదు. చిరు వ్యాపారుల జోలికి పోవద్దని ఎమ్మెల్యే ఎంత చెబుతున్నా అక్కరమాని వర్గానికి చెందిన నాయకులు, జనసేన నాయకులు మాత్రం వెలగపూడిని భేఖాతరు చేస్తున్నారు. 17వ వార్డులో మాత్రమే ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు షాపులు తొలగించలేదు. 21, 22 వార్డులో మాత్రం వెలగపూడి మాటను అటు నాయకులు..ఇటు అధికారులు పట్టించుకోలేదు. సాగరతీరంలో తొలగిస్తున్న షాపుల విషయమై ఎమ్మెల్యే వెలగపూడి దృష్టికి చిరు వ్యాపారులు తీసుకువెళ్లినా స్పష్టమైన హామీ ఇవ్వలేకపోయారు. రెండు రోజుల్లో అన్నీ సర్దుకుంటాయి..ఓపిక పట్టండని చెప్పడంతో వారంతా నిరాశగా వెనుదిరిగారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు భద్రతా పనుల నిమిత్తం పలు రైళ్లు ఆయా తేదీల్లో దారి మళిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. కింది రైళ్లు మళ్లించబడిన మార్గంలో వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా నడుస్తాయి. ఈ రైళ్లు ఆయా తేదీల్లో నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు మీదుగా ప్రయాణించవు.

- ఈ నెల 19 నుంచి 23 వరకు, 25 నుంచి 30వ వరకు ధన్‌బాద్‌లో బయల్దేరాల్సిన ధన్‌బాద్-అల్లెప్పి(13351) బొకారో ఎక్స్‌ప్రెస్ • ఈ నెల 21, 28వ తేదీల్లో టాటానగర్-యశ్వంత్‌పూర్ (18111) ఎక్స్‌ప్రెస్ • ఈనెల 20, 27వ తేదీల్లో జసిద్ది-తాంబరం (12376) ఎక్స్‌ప్రెస్ • ఈ నెల 25న హతియా-ఎర్నాకుళం (22837) ఏసీ ఎక్స్‌ప్రెస్ • ఈ నెల 23, 30వ తేదీల్లో హతియా-ఎస్ఎంవీ బెంగళూరు (18637) ఎక్స్‌ప్రెస్ • ఈ నెల 19, 26వ తేదీల్లో హతియా-ఎస్ఎంవీ బెంగళూరు (12835) ఎక్స్‌ప్రెస్ • ఈ నెల 22, 29వ తేదీల్లో టాటానగర్-ఎస్ఎంవీ బెంగళూరు (12889) ఎక్స్‌ప్రెస్ • ఈ నెల 28న విశాఖపట్నం-సాయినగర్ షిర్డీ (18503) ఎక్స్‌ప్రెస్ • ఈ నెల 29న విశాఖపట్నం-హజరత్ నిజాముద్దీన్ (12803) స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్‌లు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

భువనేశ్వర్-కెఎస్ఆర్ బెంగళూరు (18463) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 22నుంచి 30 వరకు, తిరుగు ప్రయాణంలో కెఎస్ఆర్ బెంగళూరు - భువనేశ్వర్(18464) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 23 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు 2-థర్డ్ ఏసీ కోచ్‌లను జతచేస్తున్నారు. భువనేశ్వర్-తిరుపతి(22879) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 23, 30వ తేదీల్లోను, తిరుగు ప్రయాణంలో తిరుపతి-భువనేశ్వర్(22880) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 24, డిసెంబరు 1వ తేదీల్లో 2-థర్డ్ ఏసీ కోచ్‌లను జతచేస్తున్నారు.

విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్ నమోదు చేయాలి


పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: ప్రతి విద్యార్థికి హెల్త్‌కార్డులో ఆరోగ్య ప్రొఫైల్ నమోదు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చిన్న పిల్లలకు ఆరోగ్య కార్యక్రమం నిర్వహణపై పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరావు, నోడల్ అధికారి డాక్టర్ ఎస్.వి.సమత, జిల్లా సమన్వయకర్త డాక్టర్ పూర్ణేంద్రబాబు పాల్గొన్నారు.

అంబిక స్వీట్స్ వ్యవస్థాపకుడు సత్యనారాయణ మృతి


సత్యనారాయణ(ఫైల్)

పెందుర్తి: ఉత్తరాంధ్రలో ఆదరణ పొందిన అంబిక స్వీట్స్ వ్యవస్థాపకుడు నూలు సత్యనారాయణ అనారోగ్యంతో సోమవారం కన్నుమూశారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న సత్యనారాయణ పెందుర్తిలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయ న భౌతికకాయానికి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, వ్యాపారవేత్తలు నివాళి అర్పించారు. సత్యనారాయణ అంత్యక్రియలు మంగళవారం పెందుర్తిలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.

25 నుంచి పవిత్రోత్సవాలు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు ద్వితీయ పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు. 25న సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు అంకురార్పణ, 26వ తేదీన పవిత్ర ప్రతిష్ఠ, 27న మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు పవిత్ర సమర్పణ, 28న సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు పూర్ణాహుతి నిర్వహించనున్నామని పేర్కొన్నారు. అదే విధంగా ఉదయం 10.30 నుంచి 11.30 నిల వరకు శ్నపన తిరుమంజనం నిర్వహించనున్నామని తెలిపారు.

కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

విశాఖ విద్య: జిల్లాలో మంగళవారం జరిగే కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ సజావుగా జరిగేలా తగిన ఏర్పాట్లు చేశామని డీఆర్‌వో భవానీ శంకర్ అన్నారు. సంబంధిత అధికారులతో సోమవారం తన చాంబర్‌లో పరీక్షల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. జిల్లాలో 301 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానుండగా, వీరి కోసమని ఒక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. మూడు షిఫ్టుల్లో పరీక్ష ఉంటుందన్నారు.







• శివాలయాలకు కార్తీక శోభ



కార్తీక సోమవారం పురస్కరించుకుని తెల్లవారు జాము నుంచే పెద్దసంఖ్యలో భక్తులు సముద్ర స్నానాలు ఆచరించారు. శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు ప్రత్యేక పూజల అనంతరం దీపారాధన చేశారు. జిల్లా వ్యాప్తంగా శివాలయాల్లో పూజలు నిర్వహించారు. ఆలయాలు దీపాల వెలుగుల్లో మరింత శోభను సంతరించుకున్నాయి. తెల్లవారుజాము నుంచి పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆయా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

దస్త్రాలను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: భూ వినియోగ మార్పిడి కోసం వచ్చిన దస్త్రాలను ఎప్పటికప్పుడు క్లియర్ చేసే విధంగా కార్యాచరణ రూపొందించుకొని ముందుకు వెళ్లాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో ప్రణాళికా విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సీనియర్, జూనియర్ సహాయకుల వ్యక్తిగత లాగిన్‌లలో ఉన్న దస్త్రాలను సమయపాలనను అనుసరించి వాటిని క్లియర్ చేయాలన్నారు. ఈ సమావేశంలో చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప, ప్లానింగ్ అధికారులు వెంకటేశ్వరరావు, అరుణవల్లి, కిషోర్‌కుమార్, పరిపాలన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.